క్లుప్తంగా

ఆశ్రమంలో ప్రత్యేకపూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధిని రకరకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

క్రికెట్ కిట్ అందజేత



కామారెడ్డి రూరల్: మండలంలోని తిమ్మక్‌పల్లి గ్రామ యూత్ సభ్యులకు వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేశ్‌కుమార్ శనివారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్ఞానేశ్వర్, ఉపసర్పంచ్ ప్రశాంత్, యూత్ సభ్యులు నగేశ్, సందీప్, శేఖర్, దశరథ్, మణికంఠ, దిలీప్, యువకులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించాలని వినతి




లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రంథాలయ పన్ను చెల్లించాలని కోరుతూ లింగంపేట సర్పంచ్ బొల్లు లావణ్యకు స్థానిక గ్రంథపాలకుడు శ్రీనివాస్ శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ 2019 నుంచి 2023 వరకు బకాయి ఉన్న గ్రంథాలయ పన్నును చెల్లించాలని కోరారు.

రోడ్డును బాగు చేయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డును బాగు చేయించాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు. కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి కళాశాలకు వరకు వేసిన రోడ్డు మొరం కొట్టుకుపోయి అధ్వానంగా తయారైందన్నారు. రోడ్డు మధ్యలో కల్వర్టు లేక వర్షం పడినప్పుడు మొరం కొట్టుపోతుందన్నారు. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో కల్వర్టు నిర్మించి రోడ్డును సీసీరోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

నిత్యాన్నదానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అయ్యప్ప సేవా సమితి నిర్వాహకులు, గురుస్వాములు హోటల్ రాజు, చిట్టెపు వీరారెడ్డి శనివారం తెలిపారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. విరాళాలు ఇచ్చే దాతలు ముందుకు వచ్చి భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థిని బడిలో చేర్పించిన ఉపాధ్యాయుడు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లిలో బడి బయట ఉన్న విద్యార్థిని ఉపాధ్యాయులు రాజేందర్, లక్ష్మణ్‌రావు శనివారం బడిలో చేర్పించారు. స్థానిక పాఠశాలలో నాల్గో తరగతి చదివి ఐదో తరగతి వేరే పాఠశాలలో చదువుతానని బదిలీ సర్టిఫికెట్ తీసుకున్న విద్యార్థి చదువు మానేసినట్లు గుర్తించారు. సదరు విద్యార్థి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఐదో తరగతిలో చేర్పించారు.

'ఓపెన్' ప్రవేశాలకు ఆహ్వానం

దోమకొండ: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పలుగుగడ్డ ఉన్నత పాఠశాల అసిస్టెంట్ కో ఆర్డినేటర్ దత్తాద్రి శనివానం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం ఈనెల 11వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో కోర్సు పూర్తవుతుందని, 2023 – 24 విద్యా సంవత్సరానికి కోర్సు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94404 29721 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గట్టెక్కుతామా?

- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- ఎవరి లెక్కలు వారివే..
- గెలుపు అవకాశాలపై అంచనాల్లో నిమగ్నం
- పలుచోట్ల జోరుగా బెట్టింగ్‌లు
- నేడు జిల్లా కేంద్రానికి తరలనున్న ఆయా పార్టీల శ్రేణులు

ఎన్నికల ఫలితాలపై నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఫలితాలపై ఎవరికివారు లెక్కలేసుకుంటుండగా అభ్యర్థుల్లో మాత్రం టెన్షన్ నెలకొంది. మరోవైపు కామారెడ్డి ఫలితంపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తోంది. విదేశాల్లో ఉన్నవారు సైతం ఇక్కడి ఫలితాలపై బెట్టింగ్ కాస్తున్నారు. ఫలితాలపై నమ్మకంతో ఉన్న ప్రధాన పార్టీల శ్రేణులు నేడు జిల్లా కేంద్రంలోని కౌంటింగ్‌కేంద్రానికి తరలివెళ్లనున్నాయి.

అభ్యర్థుల్లో మొదలైన గుబులు

మద్నూర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత కూడికలు, తీసివేతలే మిగిలాయి. ఈ క్రమంలో అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. ఎక్కడెక్కడ తమకు ఎక్కువ, తక్కువ ఓట్లు పడ్డాయని లెక్కలు వేసుకున్న అభ్యర్థులు.. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆరా తీశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. క్రాస్ ఓటింగ్‌తో తమకు లాభం ఉంటుందని మరి కొందరు అభ్యర్థులు అంచనకు వచ్చారు. మొత్తం మీద మరో వైపు క్రాస్ ఓటింగ్ భయం కూడా అభ్యర్థులను వణికిస్తున్నది. క్రాస్ ఓటింగ్ ముంచుతుందో లేక గెలుపిస్తుందో మరి కొన్ని గంటలు వేచి చూడాల్సిందే.

ఎల్లారెడ్డి అసెంబ్లీకి 20రౌండ్లలో లెక్కింపు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 270 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 20 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఒక రౌండ్‌కు 14 టేబుళ్ల ద్వారా ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 2 లక్షల 20 వేల 531 మంది ఓటర్లు ఉండగా వీరిలో లక్షా 83 వేల 414 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 1250 మందికిగాను 1112 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోగా, ఓట్ ఫ్రం హోంకు దరఖాస్తు చేసుకున్న 219మందిలో 201 మంది ఓట్లు వేశారు. 36 మంది ఆర్మీ సర్వీసులో ఉన్న వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

హంగామాకు ఏర్పాట్లు

మద్నూర్(జుక్కల్): ఎన్నికల ఫలితాల కోసం అభ్యర్థులతోపాటు నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎదురు చూస్తున్నారు. చిన్న స్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరూ జిల్లా కేంద్రానికి తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు అభ్యర్థులు, ఏజెంట్లు సిద్ధంగా ఉన్నారు. అయితే రేసులో ఉన్న అభ్యర్థులు కామారెడ్డి నుంచే తమ సంబురాలను ప్రారంభించుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ అనుచర గణాన్ని అక్కడికి తీసుకెళ్లి హంగామా చేయాలని భావిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.



జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

ఒకరు కొత్త.. ఇద్దరు పాత

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎకైక ఎస్సీ రిజర్వు స్థానం జుక్కల్ నియోజకవర్గం. ఇక్కడ బీఆర్‌ఎస్ తరఫున బరిలో నిలిచిన హన్మంత్ సింధే, బీజేపీ అభ్యర్థి అరుణతార ఇప్పటికే ఎమ్మెల్యేలుగా పనిచేయగా, ఇటీవలే రాజకీయరంగ ప్రవేశం చేసిన తోట లక్ష్మీకాంతరావు కాంగ్రెస్ తరఫున తొలిసారి ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడి నుంచి హన్మంత్ సింధే వరుగా మూడుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకసారి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సింధే.. ఈ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలుపుపై ధీమాగా ఉన్నారు. బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన అరుణతార 1999లో తెలుగుదేశం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యేగా ఎన్నికైన అరుణతార ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా రెండోసారి ఎన్నికల బరిలో నిలిచారు.

జోరుగా బెట్టింగులు

భిక్కనూరు: కామారెడ్డి నియోజకవర్గం ఫలితంపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కామారెడ్డి అసెంబ్లీ స్థానంలో ఎవరు విజయం సాధిస్తారు? మిగతా వారు ఏఏ స్థానాల్లో ఉంటారనే దానిపై సైతం బెట్టింగ్ చేస్తున్నట్లు సమాచారం. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వస్తుందని కొందరు లేదు బీఆర్‌ఎస్ వస్తుందని మరి కొందరూ బెట్టింగులు కాసినట్టు తెలుస్తోంది. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జోరుగా పందెలు కొనసాగుతున్నాయి. విదేశాల్లో ఉన్నవారు సైతం ఇక్కడి వారితో ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు ఖాయడం కొనమెరుపు. తనకు ఇష్టమైన నాయకుడు భారీ మెజార్టీతో గెలవడం తథ్యమని, ప్రజలకు సోమవారం పెద్ద ఎత్తున అన్నదానం చేస్తానని మండల కేంద్రానికి ఒక వ్యక్తి పేర్కొన్నారు.

మ్యాజిక్ ఫిగర్స్ నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్ల సంఖ్య మ్యాజిక్ ఫిగర్స్‌గా నమోదయ్యాయి. గాంధారి మండలం పాతంగల్‌కలాన్ పోలింగ్‌కేంద్రం నంబర్ 21లో 1008మంది, వండ్రికల్‌లోని పోలింగ్‌కేంద్రం నంబర్ 52లో 456 మంది, సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పోలింగ్‌కేంద్రం నంబర్ 93లో 809 మంది.. ఇలా పలు పోలింగ్ కేంద్రాల్లో గుర్తుండిపోయేలా మ్యాజిక్ ఫిగర్లలో ఓట్ల సంఖ్య నమోదైంది. అలాగే రాజంపేట మండలం ఆర్గోండలో 555, గుండారంలో 888, లింగంపేట మండలం మెంగారంలో 501, అయిలాపూర్‌లో 900, నాగిరెడ్డిపేట మండలం మాసాన్‌పల్లిలో 607, గోపాల్‌పేటలో 1008గా ఓట్ల సంఖ్య నమోదైంది.

ఆ కేంద్రాల్లో పోలింగ్ సమానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్‌కేంద్రాల్లో మహిళ, పురుషుల పోలింగ్ సంఖ్య సమానంగా ఉంది. సదాశివనగర్ మండలం గంట్యాల తాండలో 192 మంది మహిళలు, 192 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకోగా, గాంధారి మండలం మాధవపల్లిలో 288మంది చొప్పున, రామారెడ్డి మండలం గొల్లపల్లి పోలింగ్‌కేంద్రం నంబర్ 79లో 212 మందిచొప్పున మహిళలు, పురుషులు సమాన సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గత ఎన్నికల్లో పోచారానికి మెజార్టీ ఇచ్చిన మండలాలు..

బాన్సువాడ రూరల్: 2018 శాసనసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో స్పష్టమైన మెజార్టీ లభించింది. సమీప ప్రత్యర్థి కాసుల బాలరాజుపై 18,842ఓట్ల మెజార్టీ సాధించారు. బాన్సువాడ మండలంలో 5098, కోటగిరిలో 4,089, రుద్రూర్ మండలంలో 1,023, బీర్కూర్‌లో 1,741, నస్రుల్లాబాద్‌లో 2,767, వర్నిలో 4,124ఓట్ల మెజార్టీ లభించింది. 2018 ఎన్నికల్లో బాన్సువాడ మండలంలోని గ్రామీణ ఓటర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అండగా నిలిచారు. అప్పుడు మండలంలో 13 పంచాయతీలు ఉండగా 10 గ్రామ పంచాయతీల పరిధిలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్పష్టమైన మెజార్టీ లభించింది. మెజార్టీ ప్రాతిపదికన ఉమ్మడి హన్మాజీపేట్ గ్రామంలో అత్యధికంగా 990 ఓట్లు, తిర్మలాపూర్‌లో 73, కొల్లూర్, నాగారం గ్రామాల్లో 755, ఇబ్రాహీంపేట్‌లో 613, రాంపూర్‌లో 598, పోచారంలో 512, దేశాయిపేట్‌లో 492, ఉమ్మడి బోర్లంలో 470, కోనాపూర్‌లో 388, సంగోజీపేట్‌లో 63ఓట్లు టీఆర్‌ఎస్‌కు మెజార్టీ లభించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాసుల బాలరాజుకు బాన్సువాడ పట్టణంతో పాటు తాడ్కోల్ గ్రామ పంచాయతీలో 146ఓట్లు, సోమేశ్వర్‌లో 73ఓట్లు, బుడిమిలో 56 ఓట్ల స్వల్ప మెజార్టీ లభించింది.

అయ్యప్ప మాలధారుల పూజలు



మద్నూర్‌లోని సన్నిధానంలో పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

మద్నూర్(జుక్కల్): కార్తీక మాసం ప్రారంభం నుంచి మండలంలో అయ్యప్ప మాలధారులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండల కేంద్రంలోని సన్నిధానంలో అయ్యప్పకు స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని పెద్దతడ్గూర్, ధన్నూర్, పెద్ద ఎక్లార, మద్నూర్, కోడిచిర, సిర్పూర్ తదితర గ్రామాల్లో సన్నిధానాలు ఏర్పాటు చేసుకొని దీక్షలను స్వీకరిస్తూ కఠోర నియమాలను పాటిస్తున్నారు. మండలంలో రెండు వందల మంది భక్తులు అయ్యప్ప దీక్ష తీసుకున్నట్లు గురుస్వాములు లక్ష్మణ్, సాయిలు తెలిపారు. 41 రోజుల పాటు అయ్యప్ప స్వామిని భక్తితో కొలిచి అనంతరం శబరిమలకు వెళ్తామని వారు పేర్కొన్నారు.

ఉప ఎన్నికలు లేనట్టేనా..?

- దగ్గర పడుతున్న సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం
- పలు చోట్ల ఖాళీగా ఉన్న పదవులు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగియనుండగా, జిల్లాలో పలుచోట్ల ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల పదవులుకు ఉప ఎన్నికల నిర్వహణ ఊసేలేకుండాపోయింది. దీంతో ఆ పదవులు ఖాళీగా ఉండగానే పదవీకాలం పూర్తవుతుందేమోనని పలువురు పేర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న సర్పంచు, ఎంపీటీసీ, వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని అందరూ భావిస్తున్నారు. 2019 ఫిబ్రవరి 2 నుంచి గ్రామ పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరాయి. రామారెడ్డి పంచాయతీ 9వార్డు పాలకవర్గ సభ్యుడు 2019 మే నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రామారెడ్డి మండలంలోనే నాలుగు వార్డు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అప్పటి నుంచి వార్డులకు ఎన్నికలు నిర్వహించలేదు. జిల్లా వ్యాప్తంగా 626 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 121 వార్డు సభ్యులతోపాటు కొన్ని గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అనేక సార్లు ఖాళీగా ఉన్న స్థానాల వివరాల నివేదికను ఎన్నికల కమిషన్‌కు పంపినా, ఉప ఎన్నికల ఊసులేకుండాపోయింది. సాధారణ ఎన్నికలు ముగిసిన మరో రెండు నెలల వ్యవధిలో సర్పంచుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఉప ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని స్పష్టమవుతోంది. గతంలో కామారెడ్డి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాలకు సంబంధించిన వివరాలను సేకరించడంతో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని భావించారు.

ఇప్పుడు ఎన్నికలు నిర్వహించినా సర్పంచులు, వార్డు సభ్యుల పదవి కాలం మరో రెండు నెలల్లో ముగుస్తుంది. రెండు నెలల పదవి కోసం ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించడం ఆసాధ్యమని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న సర్పంచు, వార్డు సభ్య స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించకుండా ఐదేళ్ల పదవీ కాలం ముగియనుంది.

యూనియన్ బ్యాంకులో 'నో క్యాష్'

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకుకు డబ్బుల కోసం వచ్చిన రైతులు, ఖాతాదారులు డబ్బుల కొరత కారణంగా ఇబ్బందులు పడ్డారు. బ్యాంకులో నగదు అందుబాటులో లేకపోవడంతో బ్యాంకుసిబ్బంది బ్యాంకు ప్రధానద్వారం వద్ద శనివారం 'నో క్యాష్' బోర్డు పెట్టారు. దీంతో డబ్బుల కోసం వచ్చినవారు నిరాశకు గురయ్యారు. కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడంతో పలువురు రైతులు నగదును డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వస్తున్నారు. ఖాతాదారుల తాకిడి ఎక్కువకావడంతో నగదుకొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు సిబ్బంది సైతం 'నో క్యాష్'బోర్డును ఏర్పాటు చేశారు. ఈ విషయమై బ్యాకు మేనేజర్ సాగర్‌షిండేను సంప్రదించగా.. ఇటీవల ధాన్యండబ్బులు రైతుల ఖాతాల్లో జమకావడంతో వాటిని తీసుకునేందుకు రైతులు ఒక్కసారిగా బ్యాంకుకు వస్తున్నారని, దీంతో నగదు కొరత ఏర్పడుతున్నదన్నారు. సోమవారం నుంచి ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నగదు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.



బ్యాంక్ గేట్‌కు పెట్టిన నో క్యాష్ బోర్డు

సమయపాలన లేని పోస్టల్ పేమెంట్ బ్యాంకు!



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసు ప్రాంగణంలో ఉన్న ఇండియా పోస్టుపేమెంట్ బ్యాంకు(ఐపీపీబీ) సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు సాధారణ బ్యాంకులాగే ఐపీపీబీ పని చేయాల్సి ఉండగా, కార్యాలయం తెరిచి ఉన్నా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. పోస్టల్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పనివేళల్లో సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పేరుకే పఠనాలయం

- కనిపించని పుస్తకాలు, పాలకులు
- లక్షలు వెచ్చించినా నిరుపయోగమే..!

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌర పఠనాలయం ఏర్పాటు చేసినా.. ఎవరికీ ఉపయోగపడింది లేదని పుస్తక ప్రేమికులు అంటున్నారు. లక్షలు పెట్టి నూతన భవనం నిర్మించినప్పటికీ దానిని ఉపయోగంలోకి తీసుకురావడం లేదు. విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకోవడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినప్పటికీ.. అందులో పుస్తకాలను పెట్టకుండా వదిలేశారు. త్వరగా పఠనాలయాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న పౌర పఠనాలయ భవనం

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని ప్రార్థనలు



ఇబ్రాహీంపేట్‌లో ప్రార్థనలు చేస్తున్న మైనారిటీలు

బాన్సువాడ రూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావాలని కోరుతూ ఇబ్రాహీంపేట్ గ్రామంలో మైనారిటీ నాయకులు శనివారం ఇబ్రహీంబాషా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏడోసారి విజయం సాధించాలని ప్రార్థించామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మొహ్మద్ వసీయొద్దీన్, సమద్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

హన్‌మాన్ చాలీసా పారాయణం

కామారెడ్డి అర్బన్: ఆధ్యాత్మిక భావనలో భాగంగా శనివారం ఉదయం 8గంటలకు స్థానిక గంజ్ వర్తక సంఘ శ్రీహన్‌మాన్ ఆలయం వద్ద హనుమాన్ చాలీసా సామూహిక పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి శనివారం ఉదయం 8గంటల నుంచి అరగంట పాటు చాలీసాపారాయణం నిర్వహిస్తుండడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారని ప్రతినిధి వై సుదర్శన్ తెలిపారు. పారాయణం అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

బాన్సువాడ : పట్టణంలోని కొమురవెల్లి మల్లన్న ఆలయన ప్రథమ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గంగమ్మకు బోనాల సమర్పణ, ఆదివారం గంపల మల్లన్న జాతర, సోమవారం కొమురవెల్లి మల్లన్న కల్యాణం, అగ్నిగుండం, 5న ఎల్లమ్మ కల్యాణం, 6న ఒగ్గు కథ ఉంటుందని యాదవ సంఘం సభ్యులు మట్ట సాయిలు యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, జనార్దన్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మల్లన్న కృపకుపాత్రులు కావాలని వారు కోరారు.

